



సాక్షి
జగిత్యాల



బుధవారం । 8 । మార్చి । 2023



ఆ...అన్నింటా ఆమె..

ఆడపిల్లగా భువిపైకి వచ్చి..
అక్కగా ఆదరించి..
చెల్లిగా తోడుగా నిలిచి..
భార్యగా ఏడడుగులు నడిచి..
అమ్మగా లాలించి..
ఇల్లాలిగా ఇంటిని పాలించి..
భావి తరాలకు మార్గదర్శిగా
నిలిచింది మహిళ

ఆమె అవని.. విశ్వానికి జనని.. ఆమె పుట్టుక ఆనందం. ఆమె ఓపికకు వందనం. ఆమె లేనిదే జననం లేదు. ఈ ప్రపంచానికి మనుగడే లేదు. నాడు వంటింటికే పరిమితమై ఇల్లు దాటని మహిళ నేడు ఆకాశంలో సగం.. అవనిలో సగం అన్నట్లు సాగుతోంది. చదువులో అగ్రస్థానంలో నిలుస్తూ.. అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. అటెండర్ నుంచి ఐఏఎస్, ఐపీఎస్ బాధ్యతలు నిర్వహిస్తూనే.. ఇంటి బాధ్యతలను మరో చేతితో మోస్తోంది. కష్టాల్లో ఉన్నా బతుకుబండిని లాగుతోంది. ఇలా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తుండగా.. పురుషులకు తామేమీ తక్కువ కాదంటూ.. ధీమాగా ముందుకు సాగుతున్నారు. ఆడపిల్ల పుట్టిందంటే భయపడే నాటికాలం నుంచి ఆడపిల్ల అంటే మహాలక్ష్మి అని భావిస్తూ.. ఘనస్వాగతం పలుకుతున్నారు కొందరు. ఊర్లో అమ్మాయి పుడితే ఆర్థికంగా అండగా ఉంటున్నారు పలువురు ప్రజాప్రతినిధులు.. ఓటమిని పట్టించుకోమంటూ... గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెబుతున్నారు నేటి యువత. నేడు మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు..!!

మహిళలే పాలకులు..

కథలాపూర్(వేములవాడ): తక్కళ్లపల్లి గ్రామపంచాయతీ పాలకులు అందరూ మహిళలే. గత రెండు దశాబ్దాల్లో వచ్చిన మార్పులతో చాలామంది మహిళలు ఎన్నికల బరిలో నిలిచారు. గెలిచిన మహిళలు ప్రజా పాలనలో ప్రత్యేక ముద్ర వేస్తున్నారు. తక్కళ్లపల్లి సర్పంచ్, ఎంపీటీసీ, ఉపసర్పంచ్‌తోపాటు పంచాయతీ కార్యదర్శి సైతం మహిళ కావడం విశేషం. వీరు ప్రజా సేవలో నిరంతరం నిమగ్నమవుతున్నారు.

మహిళా ఓటర్లు అధికం..

- తక్కళ్లపల్లి జనాభా 3,099. మహిళలు 1,603 మంది, పురుషులు1,496 మంది.
- మొత్తం ఓటర్లు 2,425 మంది.. ఇందులో పురుషులు 1,124 మంది, మహిళలు 1,301 మంది.
- సుమారు నాలుగేళ్ల క్రితం గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగాయి.
- సర్పంచ్ స్థానం మహిళకు కేటాయించారు. ఉపసర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాయించినా.. ఓ మహిళ ఆ స్థానం దక్కించుకున్నారు.
- ఎంపీటీసీ కుర్చీ కూడా మహిళకు రిజర్వ్ అయింది.
- పంచాయతీ కార్యదర్శి సైతం ఓ మహిళ విధులు నిర్వర్తిస్తుండటం విశేషం.

ప్రజల సహకారంతో అభివృద్ధి



గ్రామస్తుల సహకారంతో మా ఊరును అభివృద్ధి చేస్తున్నా. మురుగునీటి కాలువలు, వీధిదీపాలు, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరిస్తున్నాం. అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. మహిళలు అక్షరాస్యులైతే అన్నిరంగాల్లో రాణిస్తారు. ఆర్థికంగా ఎదుగుతారు. అక్షరాస్యత పెంచుతున్నాం.

– మొలిగె లక్ష్మి, సర్పంచ్

ఆర్థిక స్వావలంబనకు కృషి



ప్రభుత్వం మహిళలకు ప్రత్యేకంగా 50 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించడం శుభపరిణామం. దీంతోనే వారిలో చైతన్యం వచ్చింది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు, రాజకీయాల్లో రాణిస్తున్నారు. రాజకీయ చైతన్యం, ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా మా హయాంలోనూ పనిచేస్తున్నాం. మహిళా సాధికారత కోసం కృషి చేస్తా.

– జిల్లా లక్ష్మి, ఎంపీటీసీ

ఆడపిల్ల పెళ్లికి కానుక



సాయం చేస్తున్న నేరెళ్ల హేమలత

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఆమె మహిళా సర్పంచ్. తనను ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలిపిస్తే ఆడపిల్ల వివాహానికి కానుకగా రూ.5,016 ఇస్తానని హామీ ఇచ్చారు. అనుకున్నట్లే సర్పంచ్‌గా గెలిచారు. ఆమె తిమ్మాపూర్ సర్పంచ్ నేరెళ్ల హేమలత. 2 ఫిబ్రవరి 2019న ఆమె పదవీ ప్రమాణస్వీకారం చేశారు. ఆ గ్రామంలో ఏ ఆడపిల్ల వివాహం జరిగినా ఆర్థికసాయం చేస్తున్నారు. 55 మంది యువతుల వివాహానికి కానుకగా రూ.5,106చొప్పున అందజేస్తూ వచ్చారు. తన పదవి ఉన్నంతకాలం ఇదే పద్ధతి కొనసాగిస్తానని చెబుతున్నారు హేమలత. మరోవైపు.. గ్రామంలో ఎవరు చనిపోయినా 25 కిలోల బియ్యం ఇస్తున్నానని, ఇప్పటిదాకా 100 కుటుంబాలకు ఇలా బియ్యం అందజేశానని ఆమె వివరించారు.

ఆర్టీసీ ఉద్యోగినులకు ఆటల పోటీలు

కోరుట్ల: అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు సంబురాలు స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం ఘనంగా జరిగాయి. కోరుట్ల, మెట్‌పల్లి ఆర్టీసీ డిపోల మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. మెట్‌పల్లి ఎక్సైజ్ సీఐ రాధ, కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వాసవి అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కోరుట్ల, మెట్‌పల్లి డిపోల్లో అత్యధిక ఈపీకే సాధించిన ఇద్దరు కండక్టర్లు, సీజన్ టికెట్‌లో ప్రయాణించే ఐదుగురు ప్రయాణికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశంలో సగమే!

- అవకాశాల్లోనూ సగమే..
- స్వేచ్ఛ, సమానత్వం ఇంకా రాలేదు
- అయినా, మళ్లీ ఆడవారిగానే జన్మిస్తాం

కొండగట్టు(చొప్పదండి): 'ఆకాశంలో సగమంటున్నారు.. అవకాశాల్లో సగమంటున్నారు.. ఆడ, మగ భేదం లేదంటున్నారు.. నిరుపేద నుంచి అత్యున్నత స్థానం అధిరోహించినా మహిళలకు అవమానాలు తప్పడంలేదు. అఘాయిత్యాలు ఆగడంలేదు.. లైంగికదాడులు నియంత్రణలోకి రావడంలేదు.. హత్యలకు అంతేలేదు.. ఆధునిక, సాంకేతికంగా వృద్ధి చెందుతున్న నవ సమాజంలోనూ ఆడవారిపై వివక్ష కొనసాగడం విస్మయం కలిగిస్తోంది..' అంటున్నారు నాచుపల్లి జేఎన్టీయూ విద్యార్థినులు. లింగవివక్ష లేని సమాజ నిర్మాణం, మహిళలపై అఘాత్యాలు, దాడులు, హత్యాచారాలు అరికట్టేందుకు సౌదీ తరహా చట్టాలు తేవాలని కొందరు, ఆత్మరక్షణ కోసం శిక్షణ ఇవ్వాలని మరికొందరు, ఇప్పుడున్న చట్టాలు మార్చి, ప్రభుత్వమే స్పందించాలని మరికొందరు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. మొత్తం 110మందిని కదిలిస్తే తమ అభిప్రాయాలు ఇలా వెల్లడించారు.



నాచుపల్లి జేఎన్టీయూలో సమావేశమైన విద్యార్థినులు

ఆడవాళ్ల కష్టాలు గుర్తించడంలేదు



సమాజంలో మగవారితో ఆడవాళ్లను సమానంగా చూడడంలేదు. ఆడపిల్ల పుడితే బరువుగా భావిస్తున్నారు. కల్పనాచావ్లా చాలా గొప్ప మహిళ. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలి. నవమాసాలు మోసి పిల్లలను కనడం ఎంతో కష్టం. వాళ్ల కష్టాలను ఎవరూ గుర్తించడం లేదు.

– టి.వర్షిణి, ఈఈఈ, థర్డ్‌ఇయర్ వరంగల్

మహిళలకు సంపూర్ణ స్వేచ్ఛ ఇవ్వాలి



మా అమ్మానాన్నలకు ముగ్గురం కూతుళ్లం. నా చిన్ననాటి నుంచి సమాజంలో ఆడ, మగ వివక్ష చూస్తున్నా. సాంకేతికత వృద్ధి చెందింది. అయినా మారుమూల గ్రామాల్లో అమ్మాయిలు చాలా ఇబ్బంది పడుతున్నారు. అబ్బాయిలకు ఉండాల్సిన స్వేచ్ఛ అమ్మాయిలకూ ఇవ్వాలి.

– ఎం.అనూష, ఈఈఈ, థర్డ్‌ఇయర్ రాజన్న సిరిసిల్ల

ఆత్మరక్షణకు శిక్షణ ఇవ్వాలి



ఆడవారు తాము పడే కష్టాల గురించి ఎవరికీ చెప్పరు. ప్రస్తుతం విద్యావంతులు అధికంగా ఉన్నారు. ఆధునిక యుగం నుంచి సాంకేతిక యుగానికి వృద్ధి చెందాం. అయినా, ఆడ, మగ అంటే వివక్ష చూపడం సరికాదు. ఆడవారి ఆత్మరక్షణకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వాలి.

– జి.విజ్ఞుష్ను, ఈఈఈ, సెకండియర్, కరీంనగర్

వీర వనితలకు జన్మనిచ్చింది



భారతదేశం ఎంతోమంది గొప్ప మహిళలు, వీరవనితలకు జన్మనిచ్చింది. ఝాన్సీరాణి లాంటివారు జన్మించిన ఈ దేశంలో అమ్మాయిలు సూసైడ్ చేసుకునేంత పరిస్థితుల్లో డిప్రెషన్‌లోకి వెళ్తున్నారు. చట్టాలను మార్చితేనే ప్రయోజనం. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి.

– ఎం.శ్రీజ, ఈఈఈ, థర్డ్ ఇయర్, పెద్దపల్లి

'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా 'ప్రియాంక'

- ఉమెన్స్ డే కథనాలను పర్యవేక్షించి ఫైనల్ చేసిన జడ్పీ సీఈవో
- కథనాల ఎంపిక, డిజైన్‌లలో పలు సూచనలు
- యూనిట్ కార్యాలయంలో పలు విభాగాల సందర్శన
- పత్రిక రావడం వెనుక ఇంత శ్రమ ఉందా : ప్రియాంక



ప్రచురించే కథనాలు పరిశీలిస్తున్న కరీంనగర్ జెడ్పీ సీఈవో ప్రియాంక

కరీంనగర్: కరీంనగర్ జిల్లా పరిషత్ సీఈవో ప్రియాంక మంగళవారం సాయంత్రం తిమ్మాపూర్‌లోని 'సాక్షి' యూనిట్ కార్యాలయాన్ని సందర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గెస్ట్ ఎడిటర్‌గా ఆహ్వానించగా.. సీఈవో హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్తా విశేషాలు, న్యూస్ ఎడిటింగ్ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా వచ్చిన ప్రత్యేక కథనాలను పరిశీలించారు. వార్తా కథనాల్లోని వ్యక్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ఉద్యోగుల వివరాలు, పత్రిక ప్రింటింగ్ సమయాలు, ఏయే విభాగాల్లో ఎంత మంది ఉద్యోగులు ఉంటారనే విషయాలపై ఆరా తీశారు. పత్రిక మెయిన్ పేజీతో పాటు జిల్లాల పేజీలను ప్రింటింగ్ అయ్యే సమయంలో ప్లేట్స్‌ను ఎలా వినియోగిస్తారనే విషయాన్ని ఆసక్తిగా పరిశీలించారు. జిల్లా పేజీల కూర్పు, తదితర వివరాలపై 'సాక్షి' సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో మాట్లాడుతూ.. 'ఎంతో మంది నిరంతరం శ్రమిస్తే గానీ పేపర్ బయటకురాదు. ప్రతీ క్షణం సమాచారం అందించాలనే తపనతో పనిచేస్తుండడం అభినందనీయం. మహిళా దినోత్సవం ప్రత్యేక కథనాలు బాగున్నాయి. ఇతరులను ప్రభావితం చేసే అంశాలను ఎంచుకున్నారు..' అని అన్నారు. వార్తల సేకరణ.. ఎడిటింగ్.. పేజీ డిజైనింగ్.. గురించి అడిగి తెలుసుకున్నారు. పేజీ డిజైనింగ్‌ను పరిశీలించి.. హెడ్డింగ్ బాగుందని కితాబునిచ్చారు. మహిళ దినోత్సవం సందర్భంగా పత్రిక కార్యాలయాన్ని సందర్శించి వివిధ విభాగాల పనితీరును తెలుసుకోవడం సంతృప్తినిచ్చిందని చెప్పారు.

చిన్నారులకు గ్రాండ్ వెల్‌కమ్

- మంగళహారతులతో ఘనస్వాగతం
- వైభవంగా బారసాల

మెట్‌పల్లి(కోరుట్ల): సమాజం అనేక విధాలుగా అభివృద్ధి చెందుతోంది. అయినా ఆడపిల్ల విషయంలో వివక్ష ఇంకా తొలగిపోవడంలేదు. పుట్టబోయేది ఆడపిల్ల అని తెలిస్తే కొందరు కడుపులోనే అంతం చేస్తున్నారు. మరికొందరు అసంతృప్తి, అసహనం వ్యక్తం చేస్తున్నారు. కానీ.. మెట్‌పల్లికి చెందిన రెండు కుటుంబాలు ఆడపిల్లలు పుట్టారని ఎంతోసంతోషం, ఆనందం వ్యక్తం చేశాయి. ఆస్పత్రి నుంచి తొలిసారి ఇంటికి ఇచ్చిన ఆడపిల్లలకు, వారి తల్లులకు ఘనస్వాగతం పలికాయి. 'మా ఇంటికి మహాలక్ష్మి' వచ్చిందంటూ సంబరపడిపోయాయి. బంధువులను ఆహ్వానించి ఘనంగా బారసాల నిర్వహించి ఆదర్శంగా నిలిచాయి.

తొలికాన్పులోనే ఆడపిల్ల కావాలని..

- మెట్‌పల్లి హన్మాన్‌నగర్‌కు చెందిన సాదుల చిన్నయ్య–పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో మొదటి కుమారుడు సద్గున్‌కు సౌజన్యతో వివాహం జరిగింది. అయితే, తొలికాన్పులో మనుమరాలే కావాలని చిన్నయ్య దంపతులు కోరుకున్నారు. అనుకున్నట్లే సౌజన్య గత అక్టోబర్ 28న ఓ ఆస్పత్రిలో ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఇక వారి ఆనందానికి అవధుల్లేవు. ఆస్పత్రి నుంచి బిడ్డతో ఇంటికి వచ్చిన సౌజన్యను పూలపై నడిపించుకుంటూ కుటుంబ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అంతేకాదు.. బంధుమిత్రులను ఆహ్వానించి ఘనంగా బారసాల జరిపారు.

రెండోకాన్పులోనూ..



పూజలతో స్వాగతం

- హన్మాన్‌నగర్‌కే చెందిన మోటూరి కుమారస్వామి – లక్ష్మి దంపతులకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురుకు వివాహం కాగా, ఆమెకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు శ్రావణ్‌కు అశ్వినితో వివాహమైంది. వీరికి తొలికాన్పులో కూతురే జన్మించింది. 2021లో రెండోసారి గర్భవతి అయిన అశ్వినికి.. గతేడాది జూలై 25న కూతురే పుట్టింది. తమకు ఏ బిడ్డ పుట్టినా ఆనందమే అంటూ.. శ్రావణ్ కుటుంబ సభ్యులు సంబురపడ్డారు. అటు కూతురు, ఇటు కొడుకుకు ఇద్దరు చొప్పున కూతుళ్లే పుట్టడంతో చాలామంది 'అయ్యో మళ్లీ ఆడపిల్లనే' పుట్టిందా అని నిట్టూర్చారు. ఆడపిల్లపై వివక్ష భావాన్ని చూపడంపై బాధపడ్డ శ్రావణ్ కుటుంబం.. వారంతా ఆశ్చర్యపడేలా ఇంటికి వచ్చిన చిన్నారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. నామకరణం ఘనంగా జరిపించారు. తమకు నలుగురు ఆడపిల్లలు మహాలక్ష్ములని, ఇంకా నలుగురు పుడితే.. అష్టలక్ష్మీలుగా భావిస్తామే తప్ప బాధపడమని ఆ కుటుంబం ప్రకటించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతీది.. చాలెంజ్‌గా తీసుకోవాలి

- ఆడవారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు
- కలెక్టర్ షేక్ యాష్మిన్ బాషా

జగిత్యాల: 'మన ప్రతిభ ఏమిటో మనమే నిరూపించుకోవాలి.. మహిళలకు అనేక సమస్యలు ఉంటాయి.. వాటన్నింటినీ అధిగమించాలి.. అలాగైతేనే అన్ని రంగాల్లో రాణిస్తాం' అంటున్నారు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా. తొలుత ఎంపీడీవో ఉద్యోగం సాధించిన ఆమె.. అక్కడితోనే ఆగిపోలేదు. ఉన్నత చదువులపైనా దృష్టి మళ్లించారు. డెప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. అనేక అవకాశాలు అందిపుచ్చుకుని, వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేశారు. కన్‌ఫర్మ్‌డ్ ఐఏఎస్‌గా గుర్తింపు పొందారు. ఆంధ్రాలోని ప్రకాశం జిల్లాకు చెందిన యాష్మిన్ బాషా.. పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే.. ఆమె సాధించిన విజయాలు, అధిగమించిన సవాళ్లు, సమస్యలు, భవిష్యత్ తరాలకు ఇస్తున్న స్ఫూర్తి తదితర అంశాలపై మహిళా దినోత్సవం సందర్భంగా కథనం..

మొదటి సంతానమే యాస్మిన్ బాషా..

- యాస్మిన్ బాషా తండ్రి షేక్ యూసూఫ్ పాషా రిటైర్డ్ సర్వీస్‌మన్. తల్లి షబీర గృహిణి. ఈ దంపతులకు నలుగురు ఆడపిల్లలు. తొలి సంతానం యాష్మిన్ బాషా. చిన్నప్పటి నుంచే చదువులో చురుకుగా ఉంటూ వచ్చారు.

అందరు గౌరవిస్తేనే మహిళా సాధికారత

ఆర్థిక, సామాజిక, రాజకీయంగానే కాదు.. మహిళల అభిప్రాయాలను అందరూ గౌరవిస్తేనే మహిళా సాధికారత సాధ్యమని యాస్మిన్ బాషా అభిప్రాయపడ్డారు. పుట్టినిల్లు, మెట్టినింట్లో అనేక సమస్యలు ఉంటాయని, వాటిని అధిగమించాలని సూచించారు.

లైఫ్ చాలా పెద్దది.. సమస్య చిన్నది

ప్రస్తుతం ప్రతీచిన్న విషయానికి మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంటున్నారని, అది సరికాదన్నారు. జీవితం అనేది ఎంతోపెద్దదని, సమస్య చాలాచిన్నదని, మహిళల్లో ఎంతోశక్తి ఉంటుందని, దాంతో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.



చదువే ఆస్తి..

ప్రతిఒక్కరూ చదువుకోవాలని, అదే పెద్ద ఆస్తి అన్నారు. సాంకేతికతను వినియోగించే యువత.. మంచిని స్వీకరించి, చెడును త్యజించాలని చెప్పారు. అలాగైతేనే లక్ష్యం సాధిస్తారని అన్నారు.

ఇద్దరు పిల్లలు పుట్టాక చదివా..

నాకు వివాహమై ఇద్దరు పిల్లలు పుట్టాక ఉన్నత చదువులు చదివానని అన్నారు. వంట చేయడం, పిల్లల సంరక్షణ చూసుకోవడమే జీవితం కాదని, కష్టపడి చదివి లక్ష్యం సాధించానని యాస్మిన్‌బాషా వివరించారు. మేం నలుగురం ఆడపిల్లలం. మా అమ్మానాన్న మమ్మల్ని ఆడపిల్లలని ఏనాడూ చూడలేదని తెలిపారు. తల్లిదండ్రులను గౌరవించాలని అన్నారు. అయితే, పిల్లల ఫెల్యూర్స్‌ను పాజిటివ్‌గా స్వీకరిస్తే అన్నింటా విజయం సాధిస్తారని ఆమె తెలిపారు.

ప్రతీ పనిని చాలెంజ్‌గా తీసుకోవాలి

నేను చేసే నా ఉద్యోగాన్ని చాలెంజ్‌గా తీసుకున్నా, అందుకే ఇప్పుడు కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని కలెక్టర్ అన్నారు. ఏ రంగంలోని మహిళలైనా తమ పనిని చాలెంజ్‌గా తీసుకుంటేనే విజయం సాధిస్తారని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా వివరించారు.

క్లుప్తంగా

హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ


వేడుకల్లో ఎస్పీ భాస్కర్, పోలీస్ అధికారులు

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం హోలీ సంబురాలు నిర్వహించారు. పోలీస్ అధికారులు రంగులు చల్లుకొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రకాశ్, రవీందర్ రెడ్డి, సీఐలు కిశోర్, ఆరిఫ్ అలీఖాన్, లక్ష్మీనారాయణ, కోటేశ్వర్, రమణమూర్తి, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

పసుపుతో రైతుల హోలీ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న రైతులు

మెట్‌పల్లి : మండలంలోని బండలింగాపూర్‌లో రైతులు మంగళవారం పసుపుతో ప్రత్యేకంగా హోలీ వేడుకలను జరుపుకున్నారు. పసుపు పంటకు గిట్టుబాటు ధర అందించి ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయంటూ ఈ సందర్భంగా వారు విమర్శించారు. ఇక్కడ గంగోని క్రాంతి, జంగిటి రాజేందర్, తిరుపతి రెడ్డి, హుస్సేన్, చిన్నారెడ్డి, ప్రతాప్, అనిరుధ్, శ్రీ రామ్ తదితరులున్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరుకు చెందిన ఆదిపెల్లి దేవయ్య అనే గీత కార్మికుడు మంగళవారం తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయన కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. తోటి గీత కార్మికులు సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి విడుగురాళ్ల బాలరాజ్‌గౌడ్, తాళ్లపల్లి తిరుపతి, బెజ్జారం నారాయణ, సల్లూరి నర్సయ్యలు దేవయ్యను పరామర్శించారు.

ఈసారి అంతంతే..

- ఓ వైపు పూత.. మరో వైపు పిందె, కాయలు
- మామిడిరైతు దిగాలు
- ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం
- పంటకు అనుకూలించని వాతావరణం


మార్చిలో పూతకు వచ్చిన మామిడి చెట్టు

జగిత్యాల అగ్రికల్చర్ : ఫలరాజుగా పేరుగాంచిన మామిడికి గత రెండు మూడేళ్లుగా విపత్కర పరిస్థితులు ఎదురవుతున్నాయి. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసంతో మామిడిపంటకు అనుకూల వాతావరణం ఏర్పడకపోవడం, పూత సమయంలో వచ్చే తెగుళ్లు, రసాయన మందులను పిచికారీ చేసేందుకు రైతులు ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెడుతున్నారు.

70 వేల ఎకరాల్లో మామిడి..

జిల్లాలో దాదాపు 70వేల ఎకరాల్లో మామిడితోటలుండగా ఎక్కువగా జగిత్యాల, రాయికల్, కోరుట్ల, మేడిపల్లి, గొల్లపల్లి, సారంగాపూర్ మండలాల్లో రైతులు మామిడి తోటలను పెంచుతున్నారు. మూడు, నాలుగుసార్లు కలియదున్ని, పశువుల ఎరువు, రసాయన ఎరువులను చల్లుతారు. పూతకు వచ్చే సమయంలో తెగుళ్లు, పురుగులు ఆశించకుండా, ఎకరాకు రూ.25 వేలకు ఖర్చుపెట్టి మందులను పిచికారీ చేస్తున్నారు. దీనికి తోడు మామిడి చెట్టు సామర్థ్యాన్ని బట్టి డ్రిప్ ద్వారా నీరందిస్తున్నారు. అయినా సరైన దిగుబడి రాక రైతులు దిగులు చెందుతున్నారు.

అధిక వర్షాలతో దెబ్బతింటున్న తోటలు..

అధిక వర్షాలతో మామిడిపంటలు దెబ్బతింటున్నాయి. వాస్తవంగా జూన్, జూలైలో వర్షాలు ప్రారంభమై, ఆగస్టు, సెప్టెంబర్ వరకు కురుస్తాయి. కానీ ఈ ఏడాది నవంబర్ చివరి వరకు అధికంగా వర్షాలు కురవగా భూమిలో తేమ అధికమైంది. తోటలను నీటి ఎద్దడికి (బెట్టకు) పరిస్థితులు లేకపోవడంతో తేమ ఆరక, కొమ్మలు చిగురించడం ప్రారంభమైంది. డిసెంబర్, జనవరిలో రావాల్సిన పూత ఆలస్యమైంది.

మారిన వాతావరణ పరిస్థితులు

వాతావరణ పరిస్థితులను బట్టి మామిడిలో పూత, పిందె ఏర్పడడం, తర్వాత కాయగా మారుతుంది. అయితే జనవరిలో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడం, తర్వాత అధిక ఉష్ణోగ్రతలు నమోదవడంతో కొత్తగా వచ్చిన పూత నిలబడుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొదట వచ్చిన పూత నల్లగా మారడం, అక్కడక్కడ పిందెగా మారినప్పటికీ రాలిపోతుండటంతో మామిడి రైతుల్లో ఆందోళన మొదలైంది.

ఇప్పటికే నాలుగైదుసార్లు పిచికారీ

వాతావరణంలో మార్పుల వల్ల రైతులు ఇప్పటికే నాలుగైదు క్రిమిసంహారక మందులను పిచికారీ చేశారు. కరోనా సమయంలో దిగుబడి వచ్చినప్పటికీ కొనేవారు లేక రైతులు నష్టపోయారు. ఎకరాకు 5–6 టన్నులకాయలు రావాల్సి ఉండగా, ఇప్పుడు మాత్రం రెండు మూడు టన్నులు కూడా వచ్చే పరిస్థితి కూడా లేదు.

పూత రాలుతుంది



ఐదెకరాల్లో మామిడితోట ఉంది. దాదాపు పెట్టుబడి కోసం ఇప్పటికే రూ 2.50 లక్షల వరకు ఖర్చుచేశాను. మూడుసార్లు మందులు పిచికారీ చేసినా పూత నిలవడం లేదు. దీంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. –రాజిరెడ్డి, శ్రీరాములపల్లె, గొల్లపల్లి మండలం

వాతావరణంలో మార్పులతోనే



వాతావరణ మార్పులతోనే మామిడిపంటలో పూత సరిగా నిలవడం లేదు. సాధారణంగా నవంబర్ చివరి వారం నుంచి పూత మొదలుకావాలి. కానీ ఈ ఏడాది మార్చిలో పూత కనిపిస్తోంది. దీంతో దిగుబడి తగ్గతోంది –ప్రతాప్ సింగ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి, జగిత్యాల

అమ్మాయి వివాహానికి పుస్తె, మెట్టెలు

- అయోధ్య గ్రామసర్పంచ్ ఉదారత


పుస్తె, మెట్టెలు అందిస్తున్న సర్పంచ్ జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): అమ్మాయిలు పుడితే భారంగా భావిస్తున్న రోజులివి.. అలాంటిది గ్రామంలో ఏ యువతి వివాహం జరిగినా ఆ సర్పంచ్ తనే మంగళసూత్రం, మెట్టెలు అందిస్తున్నారు. ఆయన అయోధ్య సర్పంచ్ ఎడ్మల జీవన్‌రెడ్డి, గ్రామ జనాభా 2,200 ఉంది. మొత్తం 1,500 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 826 మంది మహిళలు ఉండగా, 674 మంది పురుషులు. 2019 జనవరి 21న జీవన్‌రెడ్డి సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుంచి గ్రామంలో ఎవరి ఇంట ఆడపడుచు పెళ్లి జరిగినా.. జీవన్‌రెడ్డి జతమెట్టెలు, మంగళసూత్రాన్ని వివాహ సమయంలో వధువుకు అందజేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 50 మంది ఆడపడుచులకు పుస్తె, మెట్టెలు అందించినట్లు ఆయన తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి


బోగ శ్రావణి దంపతులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల : బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ నియోజకవర్గ నాయకురాలు బోగ శ్రావణి అన్నారు. మంగళవారం రాయికల్‌లో పట్టణ బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కల్లెడ సునీత, పట్టణ అధ్యక్షుడు ధర్మపురి, నాయకులు మల్లేశ్ యాదవ్, లక్ష్మీకాంతం, శంకర్, కిశోర్, సుమన్, నవీన్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో సంగి సత్తమ్మ

- వరుసగా మూడు సార్లు సర్పంచ్
- ప్రస్తుతం మున్సిపల్ చైర్‌పర్సన్




సంగి సత్తమ్మ

ధర్మపురి: వరుసగా మూడుసార్లు సర్పంచ్‌గా గెలిచారు.. ఈసారి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా సేవలు అందిస్తున్నారు.. ఆమె ధర్మపురి పురపాలిక చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ. పట్టణానికి చెందిన సంగి కిష్టయ్య– సత్తమ్మ దంపతులు. 1988లో ధర్మపురి పంచాయతీ సర్పంచ్‌గా కిష్టయ్య (1988–1995 వరకు) సేవలు అందించారు. మేజర్ గ్రామ పంచాయతీగా హోదా దక్కించుకోవడంతో 2006లో సర్పంచ్ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించారు. దీంతో ఆయన భార్య సంగి సత్తమ్మ బరిలో నిలిచి విజయం సాధించారు. 2006–2011 ప్రజా సేవలో పాలుపంచుకున్నారు. 2013లో రెండోసారి గెలుపొంది 2018 వరకు సేవలు అందించారు. 2020లో ధర్మపురి మున్సిపాలిటీగా మారింది. అప్పుడు కౌన్సిలర్‌గా పోటీచేసిన సత్తమ్మ.. తదనంతర పరిణామాల్లో చైర్‌పర్సన్ కుర్చీ అధిరోహించారు. ఓటమి ఎరుగని సత్తమ్మ.. వరుసగా 15ఏళ్లుగా ప్రజాసేవలో పాలుపంచుకోవడం, మహిళా సమస్యలపై సత్వరమే స్పందించి, పరిష్కరించడంలోనూ ముందుంటున్నారు.

గుండెపోటుతో రైతు మృతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బక్కయ్యగారి చంద్రారెడ్డి(65) గుండెపోటుతో మృతిచెందాడు. చంద్రారెడ్డి రోజు మాదిరిగానే సోమవారం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికొచ్చి, రాత్రి భోజనం చేసి పడుకున్నాడు. మంగళవారం తెల్లవారు జామున నిద్రలేవలేదు. కుటుంబ సభ్యులు ఉదయం లేపేసరికి అప్పటికే మృతిచెంది ఉన్నాడు. హోలీ పండుగ రోజే కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పేద రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతునికి భార్య పుష్పలత, కుమారులు బాల్‌రెడ్డి, సత్తిరెడ్డి ఉన్నారు.

‘ఉపాధి’ నిధులతోనే అభివృద్ధి పనులు

- ప్రజలపై అప్పుల భారం మోపడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్: గ్రామ పంచాయతీలు, పల్లె ప్రకృతి వనాలు, హరిత హారం, వైకుంఠధామాలు, పాఠశాలల అభివృద్ధి పనులన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం నిధులతోనే చేపడుతున్నాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలపై అప్పుల భారం మోపడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. వంట గ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని ధర్నాలు చేసే బదులు ప్రభుత్వం రాష్ట్రం విధించే పన్నును మినహాయిస్తే ప్రజలపై ధరల భారం తగ్గుతుందని సూచించారు. కాంగ్రెస్ హయాంలో పెరిగిన ధరలను ప్రజలపై భారం మోపకుండా అప్పటి ప్రభుత్వం భరించిందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజారెడ్డి, పట్టణ మండల అధ్యక్షుడు మ్యాకల రమేశ్, రవీందర్ రావు, ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, నాయకులు దివాకర్ రెడ్డి, మున్ను, ఆదిరెడ్డి, రాకేష్ నాయక్, అశోక్ నరసింహా రెడ్డి, మండ రమేశ్, మధు, మసూద్, రవీందర్, రఘు, భూమయ్య, కాశీం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం చోరీ

జగిత్యాల రూరల్ : మండలంలోని తిమ్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిలవ ఉంచిన బియ్యాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. ఎప్పటిలాగే సోమవారం అంగన్‌వాడీ కేంద్రానికి తాళంవేసి వెళ్లారు. ఉదయం చూసేసరికి నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దీనిపై అంగన్‌వాడీ కేంద్రం ఆయా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మహిళాశక్తి గొప్పది

- ఎల్‌ఎం కొప్పుల ట్రస్ట్ చైర్‌పర్సన్ స్నేహలత


మాట్లాడుతున్న స్నేహలత

బుగ్గారం(ధర్మపురి): మహిళాశక్తి ఎంతో గొప్పదని ఎల్‌ఎం కొప్పుల ట్రస్ట్ చైర్‌పర్సన్ కొప్పుల స్నేహలత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో మంగళవారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో ముందస్తు వేడుకలు నిర్వహించారు. స్నేహలత ముఖ్య అతిథిగా, జెడ్పీచైర్ పర్సన్ దావ వసంత, జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, ఎంపీపీ రాజమణి ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. తొలుత మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, పారిశుధ్య కార్మికులు, పలువురు మహిళలను సన్మానించారు. అనంతరం స్నేహలత మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుకు సాగుతున్నారన్నారు. త్రివిధ దళాల్లోనూ ప్రతిభ చూపుతున్నారని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో బహుళజాతి సంస్థలకు మహిళలే సీఈవోలు వ్యవహరించడం విశేషమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మూల సుమలత, వైస్ ఎంపీపీ సుచేందర్, నాయకులు అబ్దుల్ రహమాన్, గాలిపెల్లి మహేశ్, నన్నె విజయలక్ష్మి, ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో అఫ్జల్‌మియా తదితరులు పాల్గొన్నారు.

కుక్కలదాడిలో 18 గొర్రెలు మృత్యువాత


మృతిచెందిన గొర్రెలను చూపుతున్న బాధితుడు

కథలాపూర్ (వేములవాడ) : మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో వీధికుక్కల దాడిలో 18 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కేశవేని చుక్కయ్య రోజు మాదిరిగానే సోమవారం రాత్రి గొర్రెలను మంద వద్ద తోలి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం గొర్రెల మందపై వీధికుక్కలు దాడిచేసినట్లు స్థానికులు చుక్కయ్యకు సమాచారం అందించారు. 18 గొర్రెలు మృత్యువాతపడగా ఏడు గొర్రెలు గాయపడినట్లు బాధితుడు తెలిపాడు. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

నేటి నుంచి ‘ఆరోగ్య మహిళ’ అమలు

- జిల్లా వైద్యాధికారి శ్రీధర్


పీహెచ్‌సీలో వసతులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కథలాపూర్(వేములవాడ): మహిళలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా ఇబ్బందిపడకుండా మెరుగైన వైద్యసేవలు పొందేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ×ఆరోగ్య మహిళ÷ పథకం బుధవారం నుంచి అమల్లోకి వస్తుందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పీహెచ్‌సీలోని వసతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో మహిళలకు ప్రత్యేకంగా వైద్యం అందించడంపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సింధూజ, సూపర్‌వైజర్ నాగభూషణ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతకు చిహ్నం.. హోలీ


అడిషనల్ కలెక్టర్లతో వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగులు



సంబరాల్లో పాల్గొన్న ఎస్పీ, అధికారులు

జగిత్యాల : హోలీ ఐక్యతకు చిహ్నమని అడిషనల్ కలెక్టర్లు లత, మకరంద్, ఎస్పీ భాస్కర్ అన్నారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్లు క్యాంప్ ఆఫీస్, ఎస్పీ క్యాంప్ కార్యాలయం, టీఎన్జీవో, ట్రస్మా, పెన్షనర్స్, టీ సీనియర్ సిటిజన్ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ఎండీ. వకీల్, సీనియర్ సిటిజన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, నాగేందర్ రెడ్డి, గౌరిశెట్టి విశ్వనాథం, యాకుబ్, విజయ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అంజన్న దర్శనం కోసం భక్తుల తిప్పలు


ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కొండగట్టు (చొప్పదండి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారి దర్శనం కోసం మంగళవారం వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. కాగా భక్తులకు సరైన సదుపాయాలు కల్పించకపోవడంతో దర్శనం కోసం ఇబ్బందులుపడ్డారు. ఆలయ అధికారులు నిబంధనలు ఉల్లంఘించి అంతరాలయ దర్శనానికి టిక్కెట్లు లేకుండానే అనుమతించి వారిని శాలువాలు కండువాలతో సన్మానించారు. దీనిపై భక్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.